



# రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులు

**కూకట్‌పల్లి డిపోలో 60 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**కూకట్ పల్లి,రాజముద్ర న్యూస్:** పర్యావరణ హితమైన, ప్రయాణికులకు అనుకూలమైన ప్రజా రవాణా సేవలను అందించాలనే సంకల్పంతో కూకట్ పల్లి డిపో నుండి 60 ఎలక్ట్రిక్ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోని తెచ్చామని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఆధ్వర్యంలో కూకట్‌పల్లి డిపోలో 60 అత్యాధునిక ఎలక్ట్రిక్ బస్సులను రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ 60 ఎలక్ట్రిక్ బస్సుల చేరికతో కూకట్‌పల్లి డిపో సమగ్ర గ్రీన్ మొబిలిటీ కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. పర్యావరణ హితమైన, ప్రయాణికులకు అనుకూలమైన ప్రజా రవాణా సేవలను అందించాలనే టీజీఎస్ఆర్టీసీ సంకల్పానికి ఇది నిదర్శనమని అన్నారు. తెలంగాణ ప్రజలకు సురక్షితమైన, సమర్థవంతమైన, ఆర్థికపరంగా అందుబాటులో ఉండే, పర్యావరణహిత రవాణా సేవలను అందించాలనే లక్ష్యంతో టీజీఎస్ఆర్టీసీ ముందుకు సాగుతోందన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశంతో కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, పరిశుభ్రమైన పట్టణ రవాణా వ్యవస్థ అందుబాటులోకి రానున్నాయని మంత్రి తెలిపారు. ఆర్టీసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రతి నెల రెండవ మంగళవారం కేటాయించడం జరింగింది. కూకట్‌పల్లి డిపో తన విశిష్ట సేవా చరిత్రతో హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో బస్సులను లీజుకు ఇచ్చి వారి ఆర్థిక స్తోమత మెరుగుపరచడానికి దోహాదపడుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులను వినియోగించడానికి ప్రవేశపెడతామన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సి నవీన్ రావు, కూకట్ పల్లి ఎంఎల్ఎ మాధవరం కృష్ణారావు, కమ్మ సంఘం అధ్యక్షులు బండిరమేష్, జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఆర్టిసి ఎండి నాగిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, హకీంపేట్ డిపో మేనేజర్ సరితదేవి తదితరులు హాజరయ్యారు.

# ప్రభుత్వ పాఠశాల స్థలం సాధించే వరకు నిరంతరం పోరాటం

- గబ్బిలాల పేట ప్రభుత్వ పాఠశాల సాధన 'జేఏసీ' ఏర్పాటు..
- ఈనెల 31 నుండి జూన్ 2 వరకు సంతకాల సేకరణ, మానవహారం..
- రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ఉమ్మడి తీర్మానం..
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్



**జవహర్ నగర్, రాజముద్ర న్యూస్:** గబ్బిలాల పేటలో మంజూరైన ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం తక్షణమే స్థలాన్ని కేటాయించాలని, స్థలం సాధించేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ స్పష్టం చేశారు. బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక దళిత భవన్లో ప్రభుత్వ పాఠశాల స్థల సాధనకై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి. శంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం, మాస్ లైన్, న్యూ డెమొక్రసీ, తెలంగాణ స్పందన వేదిక, బహుజన సమాజ్ పార్టీ సిఐటియు, ఐఎఫ్టియు, టియుసిఐ, పిఓడబ్ల్యు,జనం వేదిక, ముస్లిం మైనారిటీ సంఘాలతో పాటు వివిధ ప్రజా, కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గబ్బిలాల పేట ప్రభుత్వ పాఠశాలకు అనువైన స్థలం ఏర్పాటయ్యే వరకు అందరం కలిసికట్టుగా, ఉమ్మడిగా పోరాడాలని ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

**'జేఏసీ' ఏర్పాటు - రాబోయే కార్యాచరణ:**
పాఠశాల స్థల సాధన పోరాటాన్ని ఉధృతం చేసేందుకు గబ్బిలాల పేట ప్రభుత్వ పాఠశాల సాధన జేఏసీ ని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రానున్న రోజుల్లో చేపట్టబోయే తొలి విడత కార్యాచరణను ప్రకటించారు. ఈనెల 31, జూన్ 1, 2 తేదీల్లో: స్థానిక ప్రజలు, విద్యార్థులతో విస్తృతంగా సంతకాల సేకరణ కార్యక్రమం. విద్యార్థులు, ప్రజలతో మానవహారం: ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా స్థానికులతో కలిసి భారీ మానవహారం నిర్వహించాలని నిర్ణయించారు.నూతన జేఏసీ కమిటీ ఎన్నిక: ఈ పోరాటాన్ని ముందుకు నడిపించేందుకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్: తోటపల్లి శంకర్, కో–కన్వీనర్: ఆర్. నరసింహ గౌడ్, కమిటీ సభ్యులు: శ్రీకాంత్ యాదవ్, ప్రవీణ్, శివ బాబు, కొండల ముదిరాజ్, వై. మల్లేష్, సూర వెంకటయ్య, టి. రామన్న, మంజుల, సునీత, సావిత్రి, గడ్డం సదానందం, ఎ. నరసింహ, ప్రభాకర్. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, శివన్నారాయణ, సిఐటియు నాయకులు భాస్కర్, మాస్ లైన్ న్యూ డెమొక్రసీ నాయకులు శివ బాబు, అశోక్, సునీత, మంజుల తదితరులతో పాటు వివిధ ప్రజా సంఘాల, కుల సంఘాల నాయకులు,జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు, సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, జయమ్మ, మల్లిక, మాధవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు నుంచి మహబూబాబాద్‌కు అక్రమ బెల్లం రవాణా.. 500 కేజీలు పట్టివేత

**నాటుసారా తయారీకి తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారుల దాడి.. ఇద్దరు అరెస్ట్**




**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, గుంటూరు నుంచి మహబూబాబాద్ జిల్లాకు అక్రమంగా బెల్లం, పట్టిక రవాణా చేస్తున్న వాహనాన్ని నేలకొండపల్లి ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ముదిగొండ మండలం వల్లభి గ్రామం వద్ద జరిపిన తనిఖీల్లో 500 కేజీల బెల్లం, 50 కేజీల పట్టికను స్వాధీనం చేసుకున్నారు.

**ఇద్దరు అరెస్ట్:**
ఈ కేసులో డ్రైవర్ కర్లపాటి స్వామి, మహబూబాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి, అలాగే కొండాపురం గ్రామానికి చెందిన ఎస్. యాకూబ్ పాషాలను అధికారులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు.

**నాటుసారా కోసమే**
ప్రాథమిక విచారణలో నిందితులు గుంటూరు నుంచి బెల్లం, పట్టిక కొనుగోలు చేసి మహబూబాబాద్ జిల్లా పరిసర తండాల్లోని నాటుసారా తయారీదారులకు సరఫరా చేయడానికి తరలిస్తున్నట్లు తేలింది. ఈ దందాలో పాల్గొన్న ఇతర వ్యక్తులు, సరఫరాదారులు, కొనుగోలుదారుల వివరాలు సేకరిస్తున్నామని అధికారులు తెలిపారు.

**దాడిలో పాల్గొన్న సిబ్బంది**
సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుంకరి రమేష్ పర్యవేక్షణలో సబ్ ఇన్‌స్పెక్టర్ టి. లత, సిబ్బంది ముత్తయ్య, ప్రవీణ్, శ్రావణ్, చిరంజీవి, మల్లికార్జున్ ఈ దాడుల్లో పాల్గొన్నారు.

**అధికారుల హెచ్చరిక**
నాటుసారా తయారీకి అవసరమైన ముడి పదార్థాల సరఫరా, రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ సుంకరి రమేష్ హెచ్చరించారు.



# మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసింది

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** హైదరాబాద్ విశ్వ నగరంగా రూపొందాలంటే కలుషితంకాని త్రాగునీరు రహదారులు విద్యుత్తు డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని కైతలాపూర్ లో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను 62 మంది నిరుపేదలకు కేటాయించడం జరిగింది. దీనికి సంబంధించిన పట్టాలను బుధవారం నాడు మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఇందుకు సంబంధించిన ఓ ఇంటిలో మంత్రి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేయడం జరుగుతుందని ఇందులో భాగంగానే ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం పెట్రోల్ బంకుల కేటాయింపు నూతనంగా కొనుగోలు చేసే బస్సులను మహిళా సంఘాలకు కేటాయించి తద్వారా వారు ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో పథకాలను చేపట్టిందన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం తీసుకోవడం జరిగిందన్నారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ మాట్లాడుతూ కూకట్పల్లి నియోజకవర్గంలో ఎక్కువ శాతం నిరుపేదలే ఉన్నారని వారికి అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కట్టించాలని మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో ఎంఎల్ఏ మాధవరం కృష్ణారావు, ఎంఎల్సీలు నవీన్ రావు, కలెక్టర్ మను చౌదరి, జోనల్ కమిషనర్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ బండి రమేష్, సీనియర్ నాయకుడు షేరి సతీష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# దమ్మాయిగూడ డివిజన్ లో జోనల్ కమిషనర్ పర్యటన




**దమ్మాయిగూడ, రాజముద్ర న్యూస్:** మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ఐఏఎస్, దమ్మాయిగూడ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్లు,మురుగునీటి లైన్ పనులను తనిఖీ చేశారు. బుధవారం దమ్మాయిగూడ 4 వ డివిజన్ (ఎంఎంసీ) లోని సైలెంట్ ఎన్‌క్లేవ్, సన్‌షైన్ కాలనీ, జీవిఆర్ ఎన్‌క్లేవ్, గార్డెన్యా ఎన్‌క్లేవ్, సురక్షా ఎన్‌క్లేవ్, ఈశ్వరయ్య ఎన్‌క్లేవ్, మారుతి నగర్ కాలనీ, కుందన్‌పల్లిలోని కేఎస్ఆర్ టౌన్‌షిప్ రోడ్‌తో సహా పలు ప్రాంతాలలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనరల్ సెక్రటరీ ముప్పా రామారావు, పోటీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్ గౌడ్, మాజీ సర్పంచ్ అనురాధ యాదగిరి గౌడ్, స్థానిక కాలనీ నివాసితులు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ

**త్యాగానికి, భక్తి విశ్వాసాలకు ప్రతీక బక్రీద్ అని వ్యాఖ్య**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** పాలేరు, ముస్లిం సోదర, సోదరీమణులకు పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ బుధవారం బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగానికి, భక్తి విశ్వాసాలకు ప్రతీక పవిత్ర బక్రీద్ (ఈద్–ఉల్–అధా) అని అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని కోరారు. ధనిక పేద అనే తారతమ్యం లేకుండా, రాగద్వేషాలకు అతీతంగా ముస్లింలందరూ జరిపే ప్రార్థనలు ఫలించాలని అభిలషించారు. త్యాగ నిరతికి నిదర్శనమైన బక్రీద్ పర్వదినం సందర్భంగా అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవించాలని శివరామకృష్ణ ఆకాంక్షించారు..

# భక్తుల అన్నప్రసాదాలకురూ.10,116/- విరాళం

**ముప్ప రామారావు, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి**



**దమ్మాయిగూడ, రాజముద్ర న్యూస్:** కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోనీ రాజీవ్ గృహకల్ప కాలనీలోని ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం,గ్రామ సంరక్షక శిలా కార్యక్రమానికి ముప్ప రామారావు, శ్రీకాంత్ రెడ్డి,రాజేష్‌లతో కలిసి హాజరై పూజలు అందుకున్నారు. అనంతరం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ముప్ప రామారావు ఈ శుభకార్యాలకు హాజరై, భక్తులకు అన్నప్రసాద పంపిణీ నిమిత్తం రూ.10,116/– విరాళంగా అందజేశారు.

# జవహర్ నగర్ లో సెన్సెస్- 2027 పై అవగాహన

**కీసర డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంతం**



**కీసర, రాజముద్ర న్యూస్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్ డివిజన్ కార్యాలయంలో బుధవారం సెన్సస్–2027కి సంబంధించి సూపర్వైజరులు, కో–ఆర్డినేటర్లతో,సూపర్ వైజరీ ఆఫీసర్లతో ప్రస్తుతం సర్వే జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో కొన్ని కాలనీలలో సమస్యలు ఉన్నాయని,వీలైనంత తొందరగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. పట్టణ ప్రజలు కూడా సెన్సస్ ఎన్యూమరేటర్లలకు పూర్తి స్థాయిలో సహకరించి ఈ సర్వే విజయవంతంగా పూర్తి చేయుటకు సహకరించాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎన్.వసంత, సూపర్ వైజరీ ఆఫీసర్లు, కో– ఆర్డినేటర్లు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

